# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 21, నవంబర్ 2025


### ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే

## కఠిన చర్యలు తప్పవు

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, ప్రభాతవార్త

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలో గల గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్‌ను నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల మిగతా 2లో..





## స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

నస్పూర్, నవంబర్ 20, ప్రభాతవార్త

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా మిగతా 2లో..

## పంటల కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి



✻ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, నవంబర్ 20, ప్రభాతవార్త

జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంటల కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించి కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 14,760.56 క్వింటాళ్ల వరి ధాన్యం, 5,746 క్వింటాళ్ల సోయా, 7,715 క్వింటాళ్ల మొక్కజొన్న, 66,140 క్వింటాళ్ల పత్తి పంటను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తగు తేమ శాతం వచ్చిన తరువాతే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిన రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారుల ద్వారా నమోదు చేయించి, పంట ఉత్పత్తి పరిశీలన చేపట్టించుకోవాలన్నారు. ఆ వివరాలను కొనుగోలు కేంద్రాలకు అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 351 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని, ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటల కొనుగోలులో రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి రైతుల సౌకర్యార్థం 1800 599 5779 టోల్ ఫ్రీ నెంబరు, 88972 81111 వాట్సాప్ నెంబర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో పాటు సిసిఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మంచిర్యాలలో విషాదం..

## వైద్యం వికటించి బాలుడు మృతి

మంచిర్యాల, నవంబర్ 20, ప్రభాతవార్త

వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆందోళన చేపట్టారు. మంచిర్యాలలో విషాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 4 నెలల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి అద్దాలను ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. జగిత్యాల జిల్లాకు చెందిన పాలవు శేఖర్ సౌందర్య దంపతులకు కార్తీక్ (4 నెలలు) బాబు ఉన్నాడు. నాలుగు నెలల క్రితం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్‌కు వచ్చారు. రెండు రోజుల క్రితం బాబుకు శ్వాసకు సంబంధించిన సమస్య రావడంతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ఉన్న రాఘవేంద్ర పిల్లల ఆసుపత్రికి తీసుకోవచ్చారు. ఆసుపత్రి వైద్యుడు బాబును పరిశీలించి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని రెండు రోజుల పాటు చికిత్సను అందించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బాబుకు కార్డియక్ సమస్య రావడంతో తల్లిదండ్రులకు మిగతా 2లో..

## అన్ని రకాల సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాలి

✻ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త

గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్య సేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లోని డీఈఐసి కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది చిన్నారులు మిగతా 2లో..




### అంతుచిక్కని వ్యాధితో

## 50 గొర్రెలు మృతి

★ 6 లక్షల రూపాయల ఆస్తి నష్టం

★ ఘటన స్థలాన్ని పరిశీలించిన పశుసంవర్ధక శాఖ ఇంచార్జీ జేడీ ఈర్ల శంకర్

★ ఆదిలాబాద్ ల్యాబ్‌కు శాంపిల్స్

- బెల్లంపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త



2లో..

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే
# కఠిన చర్యలు తప్పవు

**(మొదటిపేజీ తరువాయి)**

సౌకర్యార్థం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు రవాణా చేస్తుందని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు రీచ్‌ల ద్వారా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక రీచ్‌కు రాకపోకల కొరకు అవసరమైన తాత్కాలిక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల సమీపంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేతో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యం త్రాగునీరు, నీడ మౌలిక వసతులు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో విషాదం..
# వైద్యం వికటించి బాలుడు మృతి

**(మొదటిపేజీ తరువాయి)**

సమాచారం ఇవ్వకుండా చికిత్స అందించే విషయంలో వైద్యుడు నిర్లక్ష్యం చేయడంతో బాబు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుడు నిర్లక్ష్యం వలనే తమ చిన్నారి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ కుమారుడు మృతికి కారణమైన వైద్యుడు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఆసుపత్రి వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు.

### చికిత్స సమయంలో కార్డియా సమస్యతో మృతి: డాక్టర్ సతీష్ కుమార్

ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యుడు సతీష్ కుమార్‌ను వివరణ కోరగా ఈ నెల 18న శ్వాస సమస్యతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారని , తాను సరైన వైద్యం అందించినట్లు తెలిపారు. బుధవారం రాత్రి తల్లి బాబుకు పాలు పట్టిస్తున్న సమయంలో గుండెకు సంబంధించి హిడెన్ అనే సమస్య వచ్చిందని, వెంటనే ప్రథమ చికిత్స అందించానని వివరించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్ కార్డియాలిజిస్ట్ వద్దకు వెళ్లాలని సూచించానని వెల్లడించారు. అక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఆలస్యం చేయడంతో బాబు మృతి చెందాడని వైద్యుడు వివరించారు.

# అన్ని రకాల సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

హాజరయ్యారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు. ఒక చిన్నారి తల్లి హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుసుకున్న కలెక్టర్, రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇక్కడే వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా రిమ్స్‌లోనే వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. వైద్య పరీక్షలు, మందులు, స్కానింగ్, 2డీ ఈకో వంటి సేవలు రిమ్స్‌లోనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు అపోలో ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మందులు, స్కానింగ్ తదితర పరీక్షల కోసం పేదలపై భారం తగ్గేలా ప్రణాళికలు రూపొందించి, రవాణా ఖర్చులు మాత్రమే అయ్యే విధంగా హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అవసరమైతే ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్యులు వై.సి. శ్రీనివాస్, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ఈఈఈపిసి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 306 గ్రామపంచాయతీలు, 2 వేల 680 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది, ఎన్నికల సామాగ్రిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతుచిక్కని వ్యాధితో
# 50 గొర్రెలు మృతి

**బెల్లంపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కన్నెపల్లి మండలం నాయకునిపేట గ్రామ పంచాయతీలోని కురుమ గూడెం గ్రామంలో గురువారం అంతుచిక్కని వ్యాధితో 50 గొర్రెలు మృతి చెందాయి. ఘటన స్థలాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఈర్ల శంకర్ మండల పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్ శ్వేతలు పరిశీలించారు. చనిపోయిన గొర్రెలు రైతు పెద్దాల్ల వీరమళ్ళుకు చెందినవిగా గుర్తించారు. వివరాల్లోకి వెళితే వీరమల్లు తన గొర్రెలను రోజువారీ గానే రోజువారీ గానే అడవికి బుధవారం తీసుకువెళ్లగా మేత తిని అక్కడే ఉన్నాయి. గురువారం తెల్లవారు సమయానికి చూసేసరికి 50 గొర్రెలు మృతి చెంది ఉన్నాయని రైతు తెలిపారు. ఈ సంఘటనతో దాదాపు 5 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఏదో అంతుచిక్కని వ్యాధి సోకిందని నురుసులు కక్కుతూ కుప్పకూలి పోయి గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. ఇలాంటి ఘటన ఎప్పుడు జరగలేదనిఆవేదన వ్యక్తం చేశారు. తనకు బతుకు దెరువుగా ఉన్న గొర్రెలు చనిపోవడంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జేడీ ఈర్ల శంకర్ మాట్లాడుతూ కురుమ పల్లి గ్రామంలో మేతకు వెళ్లిన గొర్రెలు ఏదో అంతు చిక్కని వ్యాధితోనే మృతి చెంది ఉంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. గొర్రెల కాలేబరాల నుంచి శాంపిల్స్ సేకరించి ఆదిలాబాద్ లోని పశుసంవర్ధక శాఖ ల్యాబోరేటరీకి పంపినట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో కారణాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు గొర్రెలకు స్థానిక వైద్యులు పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం విషయమై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన వెల్లడించారు.



ఐటీడీఏ పిఓకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# అంగన్వాడీ టీచర్లను నియమించాలి

**ఉట్నూర్, నవంబర్ 20, ప్రభాతవార్త :**

మండలంలోని పులిమడుగు, అందోలి గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లను నియమించాలని బిఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. గురువారం ఐటీడీఏ పిఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులిమడుగు, అందోలిలో విధులు నిర్వహించిన్న అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ప్రమోషన్‌పై వెళ్లడంలో పులిమడుగు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంను తాళం వేసి ఉంటుందన్నారు. వెంటనే చిన్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ ఉపాధ్యాయులను నియమించి, అందోలి గ్రామంలో అంగన్వాడీ భవనం మంజూరు చేసి, అంగన్వాడీ ఉపాధ్యాయులను నియామకం చేసి పిల్లల భవిష్యత్‌ను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి బాబా శ్యామ్, అజ్మీరా జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



# జీసీసీ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

**ఉట్నూర్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

గిరిజన సహకార సంస్థ జిసిసి ఉట్నూరు డివిజన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలపై ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ గురువారం ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం లో ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో పెట్రోల్ బంక్ ల ఆదాయ వ్యయాలపై సమీక్ష చేశారు. అనవసర ఖర్చులు తగ్గించుకొని, లాభాల బాటలో నడవాలని సూచించారు. బాధ్యత రహితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. పెట్రోల్ బంక్‌లలో అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలని, అవసరమైన చోట సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. జీసీసీకి సంబంధించిన ఆస్తులను కాపాడాలని, ఎక్కడా కూడా కబ్జా అవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గిరిజన పాఠశాలలకు సరఫరా చేసే వివిధ రకాల ఆహార పదార్థాల లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ సందీప్ కుమార్, మేనేజర్లు సంతోష్ కుమార్, గులాబ్ సింగ్, ఇస్తారి, మనోహర్, లక్ష్మణ్, సొసైటీ అకౌంటెంట్లు, పెట్రోల్ పంప్ ఇంచార్జ్‌లు, డివిజనల్ ఆఫీస్ సిబ్బంది లింబరావు, సత్యం, సంతోష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ధర్మయుద్ధ సభ విజయవంతం చేయాలి

**నార్నూర్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

ఆదివాసుల హక్కుల సాధన కోసం ఈ నెల 23న ఉట్నూర్ లో నిర్వహించనున్న ఆదివాసీ ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలనీ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావ్ కోరారు. గురువారం మాన్కాపూర్ గ్రామంలో ధర్మయుద్ధ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఆదివాసీల రిజర్వేషన్లను కొల్లగొడుతున్న లంబాడలను తక్షణం ఎస్టీ జాబితా నుండీ తొలగించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఉట్నూర్ లో జరగనున్న సభకు ఆదివాసులు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రూప్ దేవ్ పటేల్, కొట్నాక్ కృష్ణ, తొడసం నాగోరావ్, పూసం ఇశ్రు, జుగ్నక్ భీంరావ్, మరియు ఆదివాసీ నాయకులు ప్రజలు ఉన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, నవంబర్ 20, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపి వేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలను రోడ్డు భద్రత నియమాలపై చైతన్య పరచాలని తెలిపారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ దిశగా జాగ్రత్త సూచికలు, బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, కల్వర్టుల వద్ద షోల్డర్స్, రేడియంతో సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ ప్రస్తుతం చలికాలం అయినందున పొగ మంచు దృష్ట్యా వాహనదారులు నిర్ణీత వేగంలో వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలిపారు. రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో ఖగఅరైవ్ – అలైవ్‌గగ నినాదంతో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల, నవంబర్ 20, ప్రభాతవార్త



మంచిర్యాల రవీంద్ర ఖని రైల్వే ట్రాక్ మధ్యలో గురువారం ఉదయం 7 గంటల 45 నిమిషాలకు ముందు కిలోమీటర్ నెంబర్ 260/1 259/43 వద్ద ఎగువ రైలు పట్టాలు, దిగువ రైలు పట్టాల మధ్య అందాజ 55 ,60 సంవత్సరాల వయసు ఒక గుర్తు తెలియని పురుషుని శవము పడి ఉన్నదని, ఏదో గుర్తుతెలియని ఎగువ రైలుబండిచే మరణించినట్లుగా ఉన్నదని అతని వంటిపై తెలుపు రంగు చొక్కా దాని పైన ఓఆర్‌డిఎస్ బిపిఎల్ టైలర్ మార్క్ కలదు. తెలుపు రంగు బనియన్ నలుపు రంగు ప్యాంటు కలదని, ఇవి తప్ప మృతుల వద్ద అడ్రస్ ఆధారాలు ఏమీ లేవని, శవాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగినదని, గుర్తుపట్టిన వారు 8328512176 ఫోన్ నెంబర్‌లో రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కు సమాచారం ఇవ్వగలరని తెలిపారు.

## గుండెపోటుతో ఆర్ఎంపి మృతి

వేమనపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని సుంపుటం గ్రామ పరిధిలోని జాజులపేటకు చెందిన చౌదరి మహేష్ (35) ఆర్ఎంపి వైద్యుడు గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి పొలం దగ్గర పడుకోడానికి వెళ్లగా ఉదయం దగ్గర ఉన్న పొలంలోని మలవిసర్జనకు వెళ్ళి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఉదయం అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుంటూ వెళ్లగా పొలంలో పడిపోయి కనిపించాడు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఇందారం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ఆకస్మిక తనిఖీ

జైపూర్, నవంబర్ 20, ప్రభాతవార్త



జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ను గురువారం రాష్ట్ర జె.జి.ఎం (పి) హుడకో జనార్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇండ్ల నిర్మాణములను ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ పీ.డీ బన్సిలాల్, హౌసింగ్ ఏఈ కాంక్ష, పంచాయతి కార్యదర్శి సుమన్‌లు ఉన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం

వేమనపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త

ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడివో కుమారస్వామి అధ్యక్షతన గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తిస్థాయిలో చేయాలని, గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇట్టి సమావేశానికి మండల పంచాయతీ అధికారి వెంకటేష్, ఏపీవో మహేశ్వర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమారస్వామి

## జాతీయ రహదారి అధికారులతో కలిసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు - మందమర్రి పోలీసులు

మందమర్రి, నవంబర్ 20, ప్రభాతవార్త

ప్రజల భద్రతను ముఖ్యంగా పరిగణలోకి తీసుకుని మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి (ఎన్.హెచ్.) అధికారులు, పోలీసు విభాగం సంయుక్తంగా కీలక రోడ్డు భద్రతా చర్యలు చేపట్టారు. యాపల్, కే.కె.2 ఏరియాలలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించే దిశగా సర్వీస్ రోడ్లలో శాశ్వత పరిష్కారంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం జరిగింది. గత కొన్ని నెలలుగా యాపల్ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించేంత ప్రమాదాలు సంభవించాయి. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల పలువురు తీవ్ర గాయాలపాలవడం, ప్రాణనష్టం సంభవించిన సందర్భాలను పరిగణలోకి తీసుకుని, మందమర్రి పోలీసులు జాతీయ రహదారి అధికారులతో ప్రత్యేక సమన్వయం చేసి భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టేందుకు కఠినమైన భద్రతా చర్యలు చేపడుతున్నాము. ప్రజల సహకారంతో సురక్షిత ప్రయాణ వాతావరణం కల్పించడం మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు. యాపల్ అంగడి బజార్ ప్రాంత ప్రజలు ఈ చర్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, రోడ్డు భద్రత కోసం పోలీసులు చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో నిదానంగా, జాగ్రత్తగా ప్రయాణించాలని, పోలీసులు ఇచ్చే సూచనలను పూర్తిగా పాటించాలని మందమర్రి పోలీసులు ప్రజలను అభ్యర్థించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు స్పష్టం చేశారు.

## జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఆసిఫాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:



జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆసిఫాబాద్ మండలంలో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి ముగ్గురిని పట్టుకున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు.ఆసిఫాబాద్ మండలం గూడెంఘాట్, తుంబపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి రూ. 9600 నగదు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురు నిందితులు, స్వాధీనం చేసుకున్న వస్తువులను ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన్నట్లు వెల్లడించారు. జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ రాజు కందూరి, హోంగార్డ్ శేఖర్, స్పెషల్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్స్ రాజ్‌కుమార్, కళ్యాణ్, మోసిన్ లు పాల్గొన్నారు.



## గ్రూప్ 2 కొలువు సాధించిన ఉద్యోగిని సన్మానించిన జీఎం

బెల్లంపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త

సింగరేణి ఉద్యోగం చేస్తూ పట్టుదలతో గ్రూప్ 2 కొలువు సాధించిన ఉద్యోగిని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి గురువారం గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో సన్మానించారు. జిఎం కార్యాలయం ఎన్విరాన్మెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న చీర్ల సురేష్ రెడ్డి ఉప తహసిల్దార్ గా కొలువు సాధించారు. పట్టుదలతో చదివి గ్రూప్ 2 సాధించినందుకు జిఎం శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే నిరుద్యోగ యువత గోలేటిలో సింగరేణి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిఎం కోరారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (ఐఈడీ) ఉజ్వాల్ కుమార్ బెహరా, డిజిఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ అధికారి హారీష్, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్, పిఇ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల తనిఖీ

వేమనపల్లి,నవంబర్ 20, ప్రభాతవార్త




మండలంలోని కేతనపల్లి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గురువారం ఎంపీడీవో కుమారస్వామి, మండల పంచాయతీ అధికారి వెంకటేష్‌తో కలసి సందర్శించారు. ఇండ్ల నిర్మాణాలను ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నర్సరీ సందర్శించి సీడ్ డిబ్లింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాఫర్ అలీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్

**ఆసిఫాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త**

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి జి పి శివధర్ రెడ్డి, ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్. పి. కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శుద్ధ శుక్లా, అదనపు ఎస్. పి. చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2874 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ కొరకు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ డెడికేషన్ కమిటీ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని, స్థానిక సంస్థల నిర్వహణకు ఎన్నికలలో అవసరమయ్యే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు ఈ నెల 23వ తేదీ వరకు స్వీకరిస్తున్నామని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికలలో అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి సిద్ధంగా ఉంచామని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసే నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ మ్నారాయణ, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా ఆడిట్ అధికారి రాజేశ్వర్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల గుర్తింపు సర్వే

**తాండూర్, నవంబర్ 20, ప్రభాతవార్త :**



మండలంలోని ఆయా గ్రామాలలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మల్లేశం తెలిపారు. 202627 సంవత్సరానికి సంబంధించిన బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాలని తెలంగాణ సమగ్ర శిక్షా సంచాలకులు, మంచిర్యాల జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశానుసారం సర్వే ప్రారంభించామన్నారు. మండల పరిధిలోని బడి బయట 6 నుండి 19 సంవత్సరాలు వయసు గల పిల్లల సర్వే ఈనెల 20 నుంచి 31 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. బడి మధ్యలో మానేయడము, దానికి గల కారణాలు తెలుసుకొని విద్యార్థులను దగ్గరలో వున్న పాఠశాల లో చేర్పించడం జరగుతుందన్నారు.



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపిడిఓ ఆల్బర్ట్

## గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా ప్రదర్శన

**పెంచికల్ పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**

పెంచికల్ పేట్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం ఎంపిడిఓ ఆల్బర్ట్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఆల్బర్ట్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, లోపాలు, పేర్లు కలపడం లేదా తీసివేయడం వంటి అభ్యంతరాలు ఉంటే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాతపూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నిర్ణీత సమయంలో అందిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**చింతలమానేపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రైతు విష్ణువర్ధన్ అనే విద్యార్థి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక య్యారు. ఇటీవల జరిగిన ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ జెడ్పి పాఠశాల మైదానంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇచ్చోడ లో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా ఇదే విద్యార్థి రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. దీంతో ఎంఈఓ జయరాజు, ఇంచార్జి హెచ్ఎం దాణేష్, పీడి (కోచ్) హరీష్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, పలువురు విద్యార్థికి అభినందనలు తెలిపారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

## గంజాయి మొక్కల పట్టివేత

**కెరిమెరి, నవంబర్ 20, ప్రభాతవార్త :**

కెరమెరి మండలం శివగూడ గ్రామం, లో నిషేధిత గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు, కెరమెరి ఎస్సై మధుకర్ తన సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ నిర్వహించారు. శివ గూడా గ్రామానికి చెందిన టెకం రాజు, అనే వ్యక్తి వద్ద 14 గంజాయి మొక్కలు లభించినట్లు ఎస్సై ఎన్ మధుకర్ తెలిపారు గంజాయి మొక్కలను స్వాధీనపరచుకున్నారు. మొక్కల అంచనా విలువ సుమారు రూ.1,40,000 వేలు ఉంటుందన్నారు. ఈ ఘటనపై నిందితుడిపై సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేశామన్నారుజిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు హెచ్చరించారు, ఆయన వెంట జైనూరు సిఐ రమేష్,పోలీసు సిబ్బందితో పాటు ఆటవిశాఖ డిఆర్ఓ జలీల్ అహ్మద్,ఎఫ్ఎస్ఓ తిరుమల రావు ఉన్నారు.

## మేక దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

**పెంచికల్ పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

మండలంలోని దర్గాపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన మేక దొంగతనం కేసులో గురువారం వ్యక్తిని అరెస్ట్ చేసినట్లుగా ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం చింతలమానేపల్లి గ్రామానికి చెందిన ఓంకార్ అనే వ్యక్తి మేకను దొంగిలించాడని బాధితుడు పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా జ్యూడిషియల్ కస్టడీకి పంపించినట్లుగా తెలిపారు.



దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని విచారిస్తున్న ఎస్సై అనిల్ కుమార్

## ఆడపడుచులకు కళ్యాణ్ లక్ష్మి వరం

### - ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**సిర్పూర్(టి), నవంబర్ 20 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రోజున ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరం లాంటిదని అన్నారు. కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ పథకం నిరుపేద దళిత గిరిజన, బిసి, ఓసి, మైనార్టీ కుటుంబాల్లో వెలుగు నింపుతుందని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రహీముద్దీన్ ఎంపీడీవో సత్యనారాయణ ఆర్ఐ ప్రవీణ్ వేణు,బిజెపి మండల అధ్యక్షురాలు లావణ్య, నేరెళ్ల అశోక్, పైడి విలాస్,బనర్కర్ సాయి,దుర్గం ప్రశాంత్, శ్యామ్రావు,మహేష్,రాజశేఖర్,దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీల వద్ద అక్రమ వసూళ్లు

**సిర్పూర్ (టి), నవంబర్ 20,ప్రభాతవార్త :**

మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామపంచాయతీ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద సిబ్బంది ఆక్రమ వసూళ్లు చేస్తున్న వీడియో వైరల్ అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతి కూలీ నుంచి వారానికి 200 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఓ సత్యనారాయణను వివరణ కోరగా దీనిపై ఏపీవో ,ఎంపిఓలతో విచారణ జరిపి వసూలు చేసినట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, నవంబర్ 20, ప్రభాతవార్త**

జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి అనిత, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారితో కలిసి డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుతో కలిగే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 438 ఎకరాలలో సాగు జరుగుతుందని, సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి మిగతా లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో ఆదాయం అధికంగా ఉంటుందని, ఈ విషయంపై రైతులకు వివరించి పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల వద్ద నుండి తేమ శాతం, ఇతర నిబంధనల ప్రకారం నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకుల సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సదుపాయాలను సమకూర్చి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన తరువాత వారికి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక చర్యలను చేపడుతుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి పంట ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసి చెల్లింపులు చేసేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకుగాను జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రబీ సాగుకు అన్నదాత సన్నద్ధం

**సారంగాపూర్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

ఖరీఫ్‌లో రైతును ఆదుకోకపోయినా కనీసం రబీ లోనైనా తమ కష్టాలు తీరుతాయని గంపడాశతో రబీ సాగుకు రైతాంగం సన్నద్ధమవుతుంది. గడచిన ఖరీఫ్‌లో రైతులకు అకాల వర్షాలతో నష్టం తో పాటు కష్టాలు ఎదురయ్యాయి. ఒకపక్క దిగుబడులు రాక మరోపక్క సరైన సమయంలో సోయా, పత్తి కొనుగోలు చేయకపోవడంతో, సరియైన గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులకు గురి అయ్యారు. కానీ కనీసం పెట్టిన పెట్టుబడి కూడ రాలేదు. ఈ కష్టాలు, నష్టాలు పక్కన కుబెట్టి రబీ సాగుపై సై అంటున్నారు. రైతులు సారంగాపూర్ మండలంలో పత్తి 14వేల ఎకరాలు సోయా 12వేల ఎకరాలు వేయడం జరిగింది. రబీ కాలంలో పూర్తిగా మొక్కజొన్న పంటను వేసేందుకు సిద్ధమైనారు. పత్తి, సోయావేసిన భూములు సాగులోనికి తెస్తున్నారు. గతంలో కంటే ఈసారి జొన్న సాగు విస్తీర్ణం పెరగవచ్చు అని వ్యవసాయాధికారులు అంటున్నారు.

## పెరుగుతున్న చలి తీవ్రత

**సారంగాపూర్, నవంబర్ 20,ప్రభాతవార్త:**

మండలంలో పలు గ్రామాలలో రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతను ఐదేళ్ల లోపు చిన్నారులు ఆనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్ అబ్దుల్ జావద్ హెచ్చరించారు. ఇప్పటికీ పలు రకాల వ్యాధులతో ఆస్పత్రికి వస్తున్నారని వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని. ముఖ్యంగా చిన్నారులు ఉదయం ప్రయాణాలు మానుకొని, స్కూలుకు వెళ్లే పిల్లలు స్వెటర్లు సాక్షులు ధరించి వెళ్లాలని. ప్రయాణాలు చేయడం రాత్రి సమయంలో సరియైనది కాదు.

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### - రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని

**ఆదిలాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీ పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, త్వరలో గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల నిర్వహించనున్న నేపద్యంలో సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా, ప్రతి ఫేజ్ లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున, సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి నవంబర్ 22 లోపు పరిష్కరించాలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జడ్పీ సీఈవో రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## కాగజ్‌నగర్ మేయిన్ మార్కెట్‌లో నీటి నిల్వ సమస్యపై సబ్ కలెక్టర్ పరిశీలన

**కాగజ్‌నగర్, నవంబర్ 20, ప్రభాతవార్త:**



కాగజ్‌నగర్ పట్టణంలోని మేయిన్ మార్కెట్‌లో పలు దుకాణాల ముందు రోడ్డుపై నీరు నిల్వ ఉండటం వల్ల దుకాణ యజమానులు, వినియోగదారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిన నీటిలో జారి పడి పలువురు గాయాలపాలయ్యారని వ్యాపారులు తెలిపారు. ఈ మేరకు పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, బుధవారం మార్కెట్ వ్యాపారస్తులు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సబ్ కలెక్టర్ మార్కెట్ ప్రాంతంలోని సమస్యాత్మక ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం త్వరలోనే డ్రైనేజ్, కల్వర్ట్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఏ. రాజేందర్, మున్సిపల్ సిబ్బంది, మార్కెట్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## జల సంరక్షణలో జాతీయ గుర్తింపు

### - కలెక్టర్ రాజర్షి షాకు ఆడే గజేందర్ అభినందనలు

**నేరడిగొండ, నవంబర్ 20, ప్రభాతవార్త:**



జల సంరక్షణ కార్యక్రమాల్లో అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఆదిలాబాద్ జిల్లా దేశవ్యాప్తంగా మరోసారి పేరు తెచ్చుకుంది. జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానాన్ని సాధించింది. మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా జాతీయ పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రాజర్షి షాను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాకు వచ్చిన ఈ గొప్ప గుర్తింపు పట్ల సంతోషం వ్యక్తం చేసిన గజేందర్, కలెక్టర్ చేసిన సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్

## ఏఐటీయూసీ మండల మహాసభ కార్యవర్గం ఎన్నిక

**బజార్‌హాత్నూర్, నవంబర్ 20, ప్రభాతవార్త:**

ఏఐటీయూసీ మండల మహాసభ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కీర్తి రమణ, మండల గౌరవ అధ్యక్షులు ఆవుల చంద్రకళ, ఉపాధ్యక్షులు రఘునాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రవీందర్‌అను ఎన్నుకున్నారు. అంతకుముందు ఏఐటీయూసీ మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ హాజరై మాట్లాడారు. కార్మికులకు ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, 57 సంవత్సరాల తర్వాత కూడా లేబర్ కార్డు కొనసాగించాలని, ఇండ్లు లేనివారికి ఇండ్లు మంజూరు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు 8 నెలల జీతం వెంటనే విడుదల చేయాలని వారు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలి

### - ధాంపూర్ గ్రామస్తులు

**నేరడిగొండ, నవంబర్ 20, ప్రభాతవార్త:**

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని గుడిహత్నూర్ మండలం ధాంపూర్ గ్రామస్తులు అన్నారు. గురువారం ధాంపూర్ గ్రామస్తులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్‌ను నేరడిగొండ మండల కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ధాంపూర్ గ్రామస్తులు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని దాని వల్ల గ్రామానికి వెళ్ళి దారిలో చాలా ఇబ్బందిగా ఉందని సమస్య పరిష్కరించాలని కోరారు. ఆడే గజేందర్ సానుకూలంగా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ రమేష్, గుండయ్య, సుమన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



### 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే

# ప్రభుత్వంపై ఉద్యమం తీవ్రతరం

**- బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ - రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్**

**మందమర్రి, నవంబర్ 20, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే, ప్రభుత్వంపై యుద్ధం తప్పదని హెచ్చరించారు. 130 రాజ్యాంగ సవరణలు జరిగాయి.. కానీ బీసీల హక్కులకు మాత్రం న్యాయం లేదు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 130 సార్లు సవరణలు జరిగాయని, 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఐదు రోజుల్లో అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం, 40 ఏళ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతున్న బీసీల డిమాండ్‌ను మాత్రం గుర్తించకపోవడం విచారకరమన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే భారీ ఆందోళనలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్మిక నాయకుడు సేలేంద్ర సత్యనారాయణ, మైనార్టీ నాయకులు ఎం.ఎం. అబ్బాస్, సగర సంగం జిల్లా అధ్యక్షుడు బర్ల సదానందం, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్, ఒజ్జా సాగర్ బాబు, దూడపాక రాజేందర్, శనిగారపు జనార్ధన్, వెన్నంపల్లి రవీందర్, అంకం సాగర్, శీలం మహేందర్, డాక్టర్ పోషం, కంది తిరుపతి, నస్పూరి తిరుపతి, పిల్లి మల్లేష్, బర్ల శేఖర్, శేఖర్ సార్ తదితర బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 20, ప్రభాతవార్త :**

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ గురువారం ఎస్సీ,ఎస్టీ ఆదిలాబాద్ జిల్లా కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. 2020 మార్చి 1న కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామంలో జరిగిన ఘటనలో కుటుంబ వేడుక జరుగుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బొమ్మెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి బాధితుణ్ణి కులం పేరుతో దూషించాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్.ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను నాటి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ స్వామి ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ ఈశ్వర్ సింగ్ సాక్షులను హాజరు పరిచారు. తదుపరి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రమణా రెడ్డి సాక్షులను విచారించి నేరాన్ని ధృవీకరించారు. విచారణలో నేరం రుజువుకావడంతో ఎస్సీఅండ్ఎస్టీ ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి కుమార్ వివేక్ నిందితుడు బొమ్మెల్లి శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. బాధితునికి న్యాయం జరిగేలా కృషి చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారులు, కోర్టు లైజనింగ్ అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఇలాంటి సంఘటనల్లో బాధితులు ఎలాంటి భయం లేకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి ఎస్పీ పేర్కొన్నారు.

## షీ టీం పై అవగాహన కార్యక్రమం

**మంచిర్యాల నవంబర్ 20 ప్రభాతవార్త**

రామగుండం సిపి ఆదేశానుసారం మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జ్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ గురువారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల అల్ఫోర్స్ స్మార్ట్ హై స్కూల్‌లో విద్యార్థులకు షి టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. షీ టీమ్ దాని యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధులు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, ఈవ్ టిజింగ్, టీ సేఫ్ అప్లికేషన్, జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ (జెజె యాక్ట్), మోటారు వాహనాల చట్టం, సైబర్ క్రైమ్స్ మరియు సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజ రుగ్మతలు, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి, మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల పై అవగాహన కల్పించారు. ఎవరైనా డ్రగ్స్ సేవించిన, మహిళలను వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డైల్ 100 లేదా రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700కు ఫిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, షీ టీం తో మహిళలకు భద్రత భరోసా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్ఐ హైమ, కానిస్టేబుల్స్ శ్రవణ్, జ్యోతి, సతీష్, శ్రీలత, శైలజ, అల్ఫోర్స్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్



## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం

**నిర్మల్ పట్టణం, నవంబర్ 20, ప్రభాతవార్త**

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక జల సంచయ్ - జన భాగీదారి అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## గెజిటెడ్ అధికారి సంతకాల కోసం ప్రజలు నానా తిప్పలు

**నేరడిగొండ, నవంబర్ 20, ప్రభాతవార్త:**

మండలంలో గల గెజిటెడ్ అధికారులు ప్రభుత్వ పథకాల దరఖాస్తులపై సంతకం చేయడానికి నిరాకరిస్తుండటంపై సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి ్మ, షాదీ ముబారక్, కుల ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు వంటి పత్రాలపై గెజిటెడ్ అధికారుల సంతకాలు తప్పనిసరి అని, అయితే మండలంలోని అధికారులు మీరు మా పరిధిలోకి రారు, రేపు ఎలాంటి సమస్యలు వచ్చినా మాకు ఇబ్బందులు వస్తాయి" అంటూ సంతకం చేయడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. మండలానికి వచ్చే ప్రజలు అధికారుల వద్ద తిరుగుతున్నప్పటికీ అందరూ ఒకే సమాధానం చెబుతుండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక పలువురు మధ్యవర్తులను ఆశ్రయించి, వారికి లంచం ఇచ్చి సంతకాలు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించాలని, ప్రజలను మధ్యవర్తుల వైపు నెట్టివేయకుండా అవసరమైన పత్రాలను పరిశీలించి సంతకాలు చేయాలని సంతోష్ సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాక్రే లక్ష్మణ్, ఉడుగుల అభిలాష్, దావుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉస్మానియాలో జరుగు పూలే వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



**బెల్లంపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త**

ఈ నెల 28న బిసి విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో ఉస్మానియాలో జరుగు భారతదేశ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీభాపూలే 135 వ వర్ధంతి సభ పోస్టర్‌ను నిజాం కాలేజీలో ఆవష్కరించడం జరిగింది. కార్యక్రమంలో జెఎసి అధ్యక్షుడు చెరాల వంశి, అధికార ప్రతినిధి నూకల మధు యాదవ్ మాట్లాడుతూ దేశ సామాజిక రంగాల్లో సమూల మార్పులకు పునాదులు వేసిన మహనీయులు పూలే అన్నారు. విద్య, వివేకం, అధికారం లేకపోవడం వలనే శూద్రులు కొన్ని శతాబ్దాలుగా అణగారిన వర్గాలుగ ఉంటున్నరనే జ్ఞానాన్ని అందించిన వారు పూలే అన్నారు. అటువంటి మహనీయులను వారి ఆశయాలను స్మరించుకుంటూ వారి దారిలో నడవడం ప్రస్తుత తరాల బాధ్యత అని,దీనిలో భాగంగా ఈ నెల 28న ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పూలే వర్ధంతి సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కాలేజ్ అసిస్టెంట్ ప్రొ.వెంకటేష్వర్లు, విద్యార్థి సంఘాల నాయకులు దార సతీష్, సతీష్ యాదవ్, రమావత్ చంటి, బట్ట నిచల్, స్వామి, శశాంక్, వరప్రసాద్, గణేష్ గౌడ్, అచల్, అజయ్ తథితరలు పాల్గొన్నారు.